# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాబోయే రోజుల్లో వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల నిరంతరాయ నాణ్యమైన విద్యుత్‌ను సోలార్ ద్వారా అందిస్తామన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

2. **రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్న యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.**

3. **ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందుతోందన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.**

4. **మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 8వ పోషణ పఖ్వాడా-2026 కార్యక్రమాలు రేపటి నుంచి ప్రారంభం.**

==========================

రాబోయే రోజుల్లో వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల నిరంతరాయ నాణ్యమైన విద్యుత్‌ను సోలార్ విద్యుత్ ద్వారా అందిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలో వాట్ల సోలార్ యూనిట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు కరెంట్ ఛార్జీలు పెంచలేదని, ఇక పైనా పెంచబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

--------------------------

అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి. నారాయణ సమీక్ష సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈనెలలోనే పలు భవనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించడంపై సమావేశంలో చర్చించారు. అమరావతిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల కోసం ఇళ్ల నిర్మాణాల వద్ద మౌళిక సదుపాయాల కల్పనపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

--------------------------

ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు విశాఖపట్నం జిల్లాలో పర్యటిస్తారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం నిమిత్తం సాయంత్రం విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని అధికారులు వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 19 కోట్ల రూపాయల ఖేలో ఇండియా నిధులతో స్టేడియం ఆధునీకరణ, సింథటిక్ ట్రాక్, ఫీల్డ్ తదితర అభివృద్ధి పనులకు ఆయన పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడుతో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ప్రధాన మంత్రి ముద్ర యోజన (PMMY) నేటితో 11 ఏళ్లు పూర్తి చేసుకుంది. చిన్న, సూక్ష్మ వ్యాపారులకు ఎలాంటి హామీ లేకుండా 20 లక్షల రూపాయల వరకు రుణాలు అందిస్తూ ఈ పథకం ఆర్థిక చేయూతను ఇస్తోంది. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. ఈ పథకం సూక్ష్మ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధి అవకాశాలను పెంచిందని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసి వర్గాలు, మహిళలకు ఇది చేయుతగా మారిందని పేర్కొన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారంతో ప్రధాన మంత్రి ముద్ర యోజన దేశంలో సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనలో ప్రధాన పాత్ర పోషిస్తోందని తెలిపారు.

---------------------------

తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు వ్యాపించి.. మందుల విభాగం పూర్తిగా దగ్ధమైంది. ఫర్నిచర్, ఇతర పరికరాలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 15 లక్షల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రోగులకు ఇబ్బంది లేకుండా ఇతర ఆసుపత్రి నుంచి ఔషధాలు తీసుకొస్తామని ఆస్పత్రి వైద్యాధికారి సిరాజుద్దీన్ తెలిపారు.

---------------------------

మహిళా సాధికారితే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను తిరుపతి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విశ్వకర్మయోజన పథకం ద్వారా పలు రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా ఎదిగిన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలేనికి చెందిన చాందిని పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి లబ్ధిదారులకు ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉందని చెప్పారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ పఖ్వాడా--2026 కార్యక్రమాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది పోషణ పఖ్వాడాను 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్టీకరణ' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, పోషణ పంచాయతీలు, ఆటల ఆధారిత విద్యా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీన్ టైమ్ తగ్గింపు వంటి అంశాలపై ప్రచారం చేపట్టనున్నారు.

---------------------------

మత్స్య సంపద పునరుత్పత్తికి ఆటంకం కలగకుండా తీసుకునే చర్యల్లో భాగంగా బంగాళాఖాతం తూర్పుతీరంలో ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు (61 రోజుల పాటు) చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు నిన్న జారీ చేసింది. అన్నిరకాల మెకనైజ్డ్ బోట్లు, ఇన్‌బోర్డు, ఔట్‌బోర్డు మోటార్లు అమర్చిన పడవలకు నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, తమిళనాడు, అండమాన్ నికోబార్ రాష్ట్రాల పరిధిలో ఇది వర్తిస్తుందని వెల్లడించింది.

---------------------------

రాష్ట్ర గీతం అయిన మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచారి వర్ధంతి ఈరోజు. 1914 ఆగస్ట్ 10వ తేదీన ఆయన తిరుపతిలో జన్మించారు. మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతంలో రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని నాలుగు పద్యాలలో శంకరంబాడి సుందరాచారి రచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించి గౌరవించింది. 1977 ఏప్రిల్ 8వ తేదీన సుందరాచారి తిరుపతిలో కన్నుమూశారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుపతి-తిరుచానూరు రోడ్డు మార్గంలోని ఆయన జ్ఞాపకార్థం, కాంస్య విగ్రహాన్ని నెలకొల్పి గౌరవించింది. ప్రఖ్యాత గాయకురాలు టంగుటూరి సూర్యకుమారి గ్రామఫోన్ రికార్డు కోసం పాడిన ఆ గీతం ఇప్పుడు విందాం .

వాయిస్.. 17 సెకన్లు

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ -- ఐపిఎల్ 2026లో భాగంగా ఢిల్లీ వేదికగా ఈ రోజు రాత్రి ఏడు గంటల 30 నిముషాలకు ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కానుంది.

=====================